సాక్షి
పార్వతీపురం మన్యం



ఆదివారం । 16 । జూలై । 2023

సెల్ఫీ డ్రామా



- చంద్రబాబు పాలనలో ఉమ్మడి విజయనగరం జిల్లాపై నిర్లక్ష్యం
- ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు నిధుల విడుదల శూన్యం
- హడావుడిగా సార్వత్రిక ఎన్నికల ముందు వరుసగా జీవోలు
- విసిగిన ప్రజలు 2019 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి గుణపాఠం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం
- కరోనా క్లిష్టపరిస్థితుల్లోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు
- ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇప్పుడు టీడీపీ నేతల ప్రయాసలు
- బస్సుయాత్రల్లో సెల్ఫీలు తీసుకోవడంతో సరి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రాష్ట్ర విభజన తర్వాత 2014 సంవత్సరంలో టీడీపీకి ప్రజలు పట్టం కట్టినా చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఉమ్మడి విజయనగరం జిల్లా నిర్లక్ష్యానికి గురైంది. ప్రాజెక్టులకు, అభివృద్ధి పనులకు 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావుడిగా జీవోలు ఇచ్చినా నిధుల విడుదల కాగితాలకే పరిమితమైంది. ఇక ప్రజల దృష్టిని మళ్లించేందుకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి శిలాఫలకం వేశారే తప్ప ప్రాథమికంగా చేయాల్సిన ప్రక్రియ ఏదీ పూర్తి చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. కరోనా క్లిష్ట పరిస్థితుల్లోనూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోంది. ఇప్పుడు టీడీపీ నాయకులు ఆ ఘనత అంతా తమదేనన్నట్లుగా ప్రజల్లో భ్రమ కల్పించడానికి బస్సు యాత్ర, సెల్ఫీల డ్రామా మొదలుపెట్టారు.

భోగాపురం విమానాశ్రయం...

టీడీపీ 'సిత్రం' ఇదీ

టీడీపీ నాయకులు గత వారం నెల్లిమర్ల నియోజకవర్గంలో నిర్వహించిన బస్సుయాత్రలో భాగంగా భోగాపురం వెళ్లారు. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి 2019 సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు చంద్రబాబు హడావుడిగా ఆవిష్కరించిన శిలాఫలకాన్ని చూసివచ్చారు. భూసేకరణ పూర్తి చేయకుండా, కోర్టు కేసులు పరిష్కరించకుండా, నిర్వాసితులకు పరిహారం, పునరావాసం ఏమీ పూర్తి చేయకుండా ఆ శిలాఫలకం మాత్రమే వేశారు. అదే తమ ఘనత అన్నట్లుగా అక్కడే టీడీపీ నాయకులు సెల్ఫీ తీసుకున్నారు.

వాస్తవం ఇదీ..

ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన వెంటనే భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి ఉన్న అడ్డంకుల పరిష్కారంపై దృష్టి పెట్టారు. డీ పట్టా రైతులకు, జిరాయితీ రైతులతో సమానంగా నష్టపరిహారం చెల్లించారు. కోర్టుల్లోనున్న న్యాయవివాదాలను పిటిషనర్లతో చర్చించి పరిష్కరించారు. భూసేకరణ పూర్తి చేశారు. నిర్వాసిత గ్రామాల ప్రజలకు రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలించారు. ఇలా మార్గం సుగమమైన తర్వాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా విచ్చేసి ఈ ఏడాది మే 3న శంకుస్థాపన చేశారు. ఇక జీఎంఆర్ సంస్థ కూడా అక్కడ నిర్మాణ పనులను వేగవంతం చేసింది.

రాజాం ఆస్పత్రి

టీడీపీ 'సిత్రం' ఇదీ

టీడీపీ నేతలు బస్సుయాత్ర సందర్భంగా రాజాం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వద్ద కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, రాజాం టీడీపీ ఇన్‌చార్జి కొండ్రు మురళీమోహన్, బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన వగైరా నేతలంతా సెల్ఫీ దిగారు. వాస్తవానికి చంద్రబాబు హయాంలో ఈ ఆస్పత్రిలో స్పెషాలిటీ డాక్టర్లు కాదు కదా కనీసం వైద్య సిబ్బంది కూడా కనిపించేవారుకాదు.

వాస్తవం ఇదీ..

వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. మళ్లీ ఆయన కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూ.కోటి నిధులతో అదనపు గదులు నిర్మించారు. మరో రూ.6.80 కోట్లతో కొత్త భవనం అందుబాటులోకి తెచ్చారు.



రాజాంలో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి భవనం వద్ద సెల్ఫీ దిగిన టీడీపీ నేతలు

పూర్ణపాడు-లాబేస్ వంతెన...

టీడీపీ 'సిత్రం' ఇదీ..

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గంలో పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2015 మే 25వ తేదీన కాంట్రాక్టరు బాధ్యతలు తీసుకున్నారు. రూ.9.98 కోట్లతో రెండేళ్లలో అంటే 2017 మే నాటికి పూర్తి చేయాలి. కానీ 2019 ఏప్రిల్‌లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికీ 40 శాతం కూడా పూర్తి చేయలేదు. ఇటీవల టీడీపీ బస్సుయాత్రలో భాగంగా ప్రాజెక్టు దగ్గరకు వచ్చి సమావేశం పెట్టారు. తీరా జనాదరణ లేక వెనుదిరిగారు.

వాస్తవం ఇదీ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో 2020 నవంబర్ 27న రూ.7 కోట్లు మంజూరు చేయించారు. తర్వాత పెరిగిన నిర్మాణ వ్యయం దృష్ట్యా రూ.14 కోట్లకు సవరిస్తూ అనుమతులు తెచ్చారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి.

ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ...

టీడీపీ 'సిత్రం' ఇదీ..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో కీలకమైన బొబ్బిలి సుగర్ ఫ్యాక్టరీ సహకార రంగంలో ప్రారంభమైనప్పటి నుంచీ చెరకు రైతులకు చెల్లింపులు సక్రమంగానే జరిగేవి. ఎన్టీ రామారావుకు వెన్నుపోటుతో 1995 సంవత్సరంలో అధికారం దక్కించుకున్న చంద్రబాబు... బొబ్బిలి ఫ్యాక్టరీ సహా సహకార రంగంలోని సుగర్ ఫ్యాక్టరీలపై ప్రైవేటీకరణ కత్తిని వేలాడదీశారు. తుదకు 2002 సంవత్సరంలో ఎన్‌సీఎస్‌కు రూ.20 కోట్ల స్వల్ప మొత్తానికి బొబ్బిలి ఫ్యాక్టరీని కట్టబెట్టేశారు. అప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఏటా బకాయిలు పెరిగిపోతూ వచ్చాయి. చంద్రబాబు మూడోదఫా 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా చక్కదిద్దే ప్రయత్నం చేయలేదు. ఎన్‌సీఎస్ యాజమాన్యం కూడా 2015 నుంచి వరుసగా మూడేళ్ల పాటు బకాయిలు పెట్టింది. చివరకు ఫ్యాక్టరీని నడిపించలేక ఆ ప్రైవేట్ యాజమాన్యం చేతులెత్తేసింది. ఇంతటి చంద్రబాబు ఘనకార్యాన్ని కప్పిపుచ్చడానికి ఇటీవల బస్సుయాత్రలో టీడీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేశారు. టీడీపీ ప్రభుత్వం చేసిన ఘోరతప్పిదాలను ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టేయాలని సెల్ఫీలతో విషప్రచారానికి తెరతీశారు.

వాస్తవం ఇదీ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆ బకాయిలను రాబట్టే చర్యలు తీసుకుంది. రెవెన్యూ అండ్ రికవరీ యాక్ట్ ప్రకారం ఫ్యాక్టరీకి సంబంధించిన భూములు, మొలాసిస్ విక్రయం ద్వారా సుమారు రూ.25 కోట్లు సమీకరించి రైతులకు చెల్లించింది. తర్వాత కూడా యాజమాన్యం బకాయిలు పెట్టేయడంతో మరో 27.12 ఎకరాలను రూ.20.05 కోట్లకు విక్రయించి రైతులకు, ఉద్యోగులకు న్యాయం చేసింది. ఫ్యాక్టరీ మూతపడినా రైతులు నష్టపోకుండా చెరకు సంకిలి వద్దనున్న ప్యారీస్ సుగర్ ఫ్యాక్టరీకి తరలించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వారికి చెల్లింపులు కూడా సకాలంలో జరుగుతున్నాయి.

టీడీపీ 'సిత్రం' ఇదీ..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని రామందొరవలస వద్ద ఇళ్లను నిర్మిస్తున్నామంటూ ఆ పార్టీ నాయకులు పేదలతో డిపాజిట్లు కట్టించారు. అప్పటి మంత్రి ఆర్‌వీ సుజయకృష్ణ రంగారావు సమక్షంలోనే లాటరీ తీసి వారికి ఫ్లాట్ నంబరు కేటాయించారు. తీరా ఇల్లూ లేదు. నిర్మాణాలు లేవు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అధిక మొత్తానికే కాంట్రాక్టర్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించినా అవి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయి. ఇప్పుడు నిర్మాణం పూర్తికావడంతో తామే వాటిని నిర్మించామంటూ టీడీపీ నాయకులు సెల్ఫీ తీసుకోవడం వారికే చెల్లింది.

వాస్తవం ఇదీ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటివరకూ నత్తనడకన సాగుతున్న నిర్మాణాలపై చర్యలు చేపట్టింది. నిర్మాణ పనులు 20 శాతం దాటని వాటిని రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేసింది. బొబ్బిలిలో 18 శాతం కూడా దాటకపోవడంతో రద్దు అయిపోయాయి. నిర్మాణ బాధ్యతలు కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించారు. మొత్తం 1782 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కొద్ది రోజుల్లోనే లబ్ధిదారులకు ఉచితంగా అప్పగించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మద్దువలస ప్రాజెక్టు...

టీడీపీ 'సిత్రం' ఇదీ..

బస్సు యాత్రలో భాగంగా వంగర మండల పరిధిలోనున్న గొర్లె శ్రీరాములునాయుడు మద్దువలస ప్రాజెక్టుకు టీడీపీ నాయకులు వెళ్లారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా గాలికి వదిలేసినా ఆ ప్రాజెక్టు దగ్గర సెల్ఫీ తీసుకున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద రూ.1.80 కోట్ల నిధులతో మరమ్మతులు జరుగుతున్నాయి. దీన్ని విస్మరించి మత్స్యసంపదను దోచుకునేందుకు ప్రాజెక్టులో నీటిని ఖాళీ చేశారంటూ టీడీపీ నాయకులు ఆరోపణలు చేశారు.

వాస్తవం ఇదీ..

ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద రోప్‌లు, విద్యుత్తు దీపాల ఏర్పాటు, స్పిల్‌వే, హెడ్‌స్లూయిస్‌లు, గేట్ల మరమ్మతుల పనులు జరుగుతున్నాయి. ప్రాజెక్టు భాగమంతా రంగులు వేయడం తుది దశకు చేరుకుంది. సువర్ణముఖి, వేగావతి నదుల్లో నీటి ప్రవాహం(ఇన్‌ఫ్లో) పెరిగితే ఈ నెలాఖరుకు సాగునీటి విడుదలకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.



ప్రాజెక్టు వద్ద రోప్స్ ఏర్పాటు

న్యూస్‌రీల్

స్కిల్ కళాశాలల్లో అడ్మిషన్లు

సీతంపేట: ఐటీ, టూరిజం అండ్ హాస్పిటాలిటి రంగంలోని వివిధ విభాగాల్లో స్థానిక స్కిల్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఉరిటి సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు డీయూజీకేవై, సీడాప్, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వసతి, భోజనంతో పాటు ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తామన్నారు. తరగతులు పూర్తయ్యాక ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్ ఆటోమోటివ్ అండ్ ఏరోస్పేస్‌లో బీటెక్, డిప్లమా విభాగాల్లో, ఏదైనా డిగ్రీ, ఇంటర్మీడియెట్ 2020 - 22 మధ్య ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 23 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో స్థానిక యూత్ ట్రెనింగ్ సెంటర్‌కు రావాలన్నారు. వివరాలకు 70320 60773 నంబరును సంప్రదించాలని సూచించారు.

పుష్పాలంకరణలో శ్రీనివాసుడు



విజయనగరం టౌన్: స్థానిక టిటీడీ కల్యాణ మండపం ఆవరణలో కొలువైన శ్రీనివాసుడు శనివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పీవీ.నరసింహాచార్యులు స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫీజులు వసూలు చేయొద్దు.. : డీఈవో

విజయనగరం ఫూల్‌బాగ్: ఉచిత నిర్బంద విద్యాహక్కు చట్టం12(1) ప్రకారం అన్ ఎయిడెడ్ పాఠశాల కరస్పాండెంట్లు 1వ తరగతిలో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల నుండి ఎటువంటి ఫీజులు వసూలు చేయరాదని డీఈవో బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారికి యూనిఫారం, బూట్లు, పుస్తకాలు ఉచితంగా అందజేయాలన్నారు. ఫీజులు చెల్లింపుల విషయంలో, ఎటువంటి సందేహాలు నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నంబరు 73969 99102ను సంప్రదించాలని సూచించారు.

18న ఉద్యోగ మేళా

విజయనగరం రూరల్: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 18న జిల్లా కేంద్రంలోని ఎంఆర్ అటానమస్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలైన అపోలా ఫార్మసీ, శ్రీరామ్ ఫైనాన్స్, టాటా కాపిటల్ మైక్రో ఫైనాన్స్, స్మార్ట్ సర్వీసెస్ (పేటీఎం), టెక్ మహీంద్ర, ఎస్‌బీఐ కార్డ్స్ వంటి సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు వారై ఏదైనా డిగ్రీ, ఇంటర్, బీ ఫార్మసీ కోర్సులలో ఉత్తీర్ణులై వారై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

సమగ్రశిక్ష సిబ్బందికి రిక్వెస్ట్ బదిలీలకు అవకాశం

విజయనగరం ఫూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిబ్బందికి రిక్వెస్ట్ బదిలీలు ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోవటానికి ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ డి.లింగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో జిల్లా సమగ్రశిక్ష కార్యాలయ పనివేళల్లో మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : డీఐవో

పార్వతీపురం టౌన్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఐవో డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలో పనసభద్ర, కోరె, హిందుపురం, మడకవానివలస గ్రామాలను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐవో) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు ఆకస్మికంగా శనివారం సందర్శించారు. గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఐరన్, కాల్షియం మాత్రలు వేసుకోవడం, అంగన్‌వాడీలో పౌష్టికాహారం తీసుకోవడం అంశాలపై అడిగి తగు సూచనలు ఇచ్చారు. మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సంబంధిత వైద్యాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వారి పరిధిలో ఉన్న గర్భిణుల ఆరోగ్య తనిఖీ వివరాలు ఎప్పటికప్పుడు విధిగా ఎమ్‌సీపీ కార్డులో నమోదు చేయించాలని, వాటిని పరిశీలించి వైద్యాధికారులు అందులో సంతకాలు చేయాలని ఆదేశించారు. గర్భిణిగా గుర్తించిన వెంటనే రిజిస్ట్రేషన్ చేసి, అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎటువంటి ప్రమాదకర సూచికలు(హైరిస్క్) గుర్తించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. హిందుపురంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కోరె గ్రామం ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి పిల్లలకు ధనుర్వాతం, కంఠసర్పి నివారణకు వైద్య సిబ్బంది నిర్వహించిన టీడీ వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. వ్యాక్సినేషన్ కేంద్రంలో ఉండాల్సిన మార్గదర్శకాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది సరోజిని, భారతి, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో గర్భిణుల గృహ సందర్శనలో పాల్గొన్న డీఐవో జగన్‌మోహన్‌రావు

ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించి తాత్కాలిక పద్ధతిపై టీజీటీ (ఇంగ్లిష్, హిందీ, గణితం), పీజీటీ (ఎకనామిక్స్ హిస్టరీ, పొలిటికల్ సైన్స్)లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కురుపాం ఏకలవ్య పాఠశాలలో టీజీటీ ఇంగ్లిష్, హిందీ ఒక్కొక్క పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అనసభద్ర పాఠశాలలో టీజీటీ హిందీ, ఇంగ్లిష్‌తో పాటు పీజీటీలో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొటికపెంట పాఠశాలలో టీజీటీ ఇంగ్లిష్, హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాలలో టీజీటీ ఇంగ్లిష్, హిందీ, మేథ్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రిటైర్డ్ టీచర్స్, జూనియర్ లెక్చరర్స్‌గా పని చేసిన వారు ఈ నెల 29లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9490971090 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌పై వర్క్‌షాప్ రేపు

పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కార్పొరేషన్ సొసైటీ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అథారిటీ సంయుక్తంగా జిల్లాలో నిరుద్యోగ యువత కోసం ఫుడ్ ప్రాసెస్ యూనిట్ స్థాపించడానికి వర్క్ షాప్‌ను ఈ నెల 17న మధ్యాహ్నం 3గంటలకు డీఆర్‌డీఏ ఆఫీస్ బేస్డ్ ఎస్పీ కార్యాలయంలో, వైకేఎం కాలనీ నందు నిర్వహించనున్నట్టు డీఆర్‌డీఏ పీడీ కిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రాసెస్ యూనిట్ స్థాపించడానికి ఫుడ్ కార్పొరేషన్ సొసైటీ నుండి 90 శాతం లోన్ సదుపాయం కూడా కల్పిస్తారని ఫుడ్ కార్పొరేషన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ఎస్ రెడ్డి తెలిపారు. ఇతర వివరాలకు 80747 23758 నంబరును సంప్రదించాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక రేపు

సీతంపేట: సీతంపేట ఏపీఆర్ గిరిజన గురుకులంలో స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపికలు సోమవారం జరగనున్నాయని గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బేటరీ లెవెల్ సెలెక్షన్ కోసం ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దేహదారుఢ్యం, క్రీడా నైపుణ్య సామర్థ్యాలున్న వారిని ముగ్గురేసి చొప్పున వ్యాయామ ఉపాధ్యాయులు తీసుకురావాలన్నారు. ఐదో తరగతిలో 30, బ్యాక్‌లాగ్ ఏడో తరగతిలో 30 సీట్లు, 8వ తరగతిలో 10, తొమ్మిదో తరగతిలో 18సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

కంటి చూపు కాపాడుకోవాలి : డీఎంహెచ్‌వో

పార్వతీపురం టౌన్: అవ్వా తాతలు కంటి చూపు కాపాడు కోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. బి.జగన్నాథరావు సూచించారు. పార్వతీపురం మండలంలోని బాలగుడబ సచివాలయంలో 60 పైబడిన వయస్సు గల వృద్ధులకు శనివారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు నిర్వహించి ఆరుగురికి కళ్లజోళ్లు, ఐదుగురికి కేటరాక్ట్ శస్త్ర చికిత్స కోసం గుర్తించి, వారికి రిఫరల్ చేసినట్లు ఇంకొంత మందికి సాధారణ చికిత్స చేసినట్లు తెలిపారు. గతంలో నేత్ర పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అవసరం అని గుర్తించిన వారికీ ఈ రోజు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డా. సుకుమార్ బాబు, జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి నగేష్‌రెడ్డి, సామాజిక ఆరోగ్య అధికారి జగదీష్, నేత్ర వైద్య సహాయకులు ఉమామాహేశ్వరి, ఆరోగ్య కార్యకర్త రామలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



నేత్ర వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డా. బి.జగన్నాథరావు

అందరి కృషితో మాతా శిశు మరణాల తగ్గింపు

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

గజపతినగరం: మాతా శిశు మరణాల రేటు తగ్గించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి భాస్కరరావు కోరారు. పురిటిపెంట - 1, 3 అంగన్‌వాడీ (సంతతోట) సెంటర్‌లలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి పిల్ల వానికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలను వేయాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలని, గర్భిణుల హైరిస్క్ కేసులను గుర్తించి సకాలంలో వారికి వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం పురిటిపెంటలో జరిగిన కుటుంబ వైద్య సేవలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమేష్, మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ అనూజ్ రాయ్, హెల్త్ సూపర్‌వైజర్లు పి.వి.రమణ, పైడన్నలు, ఆరోగ్య కార్యకర్తలు ఎ.సత్యవతి, సీహెచ్ పద్మ, సీనియర్ పరిపాలన అధికారి పప్పు సుదర్శనం, ఎమ్ఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.



పురిటి పెంట - 3 అంగన్‌వాడీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు



క్లుప్తంగా

రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రైల్వేట్రాక్‌పై పడిఉన్న వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని కనిమెరక గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండడాన్ని స్థానికులు శనివారం గుర్తించి, రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్న విజయనగరం రైల్వే ఎస్‌ఐ రవి వర్మ మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ అతడికి సంబంధించి, ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి, విజయనగరంలోని సర్వజన ఆస్పత్రికి మృతదేహం తరలించారు. ట్రాక్ దాటుతుండగా, రైలు ఢీకొని చనిపోయి ఉంటాడా, లేకపోతే రైలు నుంచి జారిపడి మరణించి ఉంటాడా, లేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. మృతుడి వయసు 50 ఏళ్లు పైబడి ఉంటుందని, చారల చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్ 9490617089ను సంప్రదించాలని కోరారు. రెండు రోజుల వ్యవధిలో గొట్లాం, కనిమెరక గ్రామం ప్రాంతాల్లోని రైల్వేట్రాక్‌లపై గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందిన ఘటనలు చోటుచేసుకోవడం స్థానికుల్లో కలవరం రేపుతోంది.

ఎద్దులబండిని ఢీకొన్న లారీ: ఇద్దరికి తీవ్రగాయాలు

పార్వతీపురం: ఎద్దులబండిని లారీ ఢీకొన్న ఘటనలో రెండు ఎద్దులు మృతి చెందడంతో పాటు ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన సీతానగరం మండలంలోని అనంతరాయుడుపేట జంక్షన్‌లో శనివారం చోటుచేసుకుంది. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సీతానగరం మండలం, జగ్గునాయుడుపేటకు చెందిన చొక్కాపు గౌరునాయుడు, పెంట శ్రీనివాసరావు కలిసి సువర్ణముఖి నదీతీరం నుంచి ఎద్దులబండితో ఇసుకను తరలిస్తున్నారు. అనంతరాయుడుపేట జంక్షన్‌లోని పెట్రోలుబంకు దగ్గర బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న లారీ వీరి బండిని వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందడంతో పాటు బండిపై ఉన్న గౌరునాయుడు, శ్రీనివాసరావుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో చికిత్స నిమిత్తం క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నెల్లిమర్ల 'పవర్' చూపించారు..





సాధించిన పతకాలతో పల్లవి, శ్రీలక్ష్మి

నెల్లిమర్ల రూరల్: ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న అంతర్జాతీయ కామన్‌వెల్త్ యూత్ చాంపియన్‌షిప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా పేరు మార్మోగుతోంది. పోటీలు ప్రారంభం నాటి నుంచి నెల్లిమర్లకు చెందిన వెయిట్ లిఫ్టర్లు సత్తా చాటుతూ వస్తున్నారు. వివిధ కేటగిరీల్లో పోటీల్లో పాల్గొని, పతకాలు తెచ్చిపెడుతున్నారు. ఇప్పటికే చంద్రంపేటకు చెందిన ఎస్.గురునాయుడు 2 వెండి పతకాలు, కొండవెలగాడకు చెందిన బి.హారిక, వి.అజయ్‌బాబు బంగారు పతకాలను సాధించిన సంగతి తెలిసిందే. తాజాగా అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వెయిట్ లిఫ్టర్లు పతకాలు సాధించారు. శనపతి పల్లవి 64 కేజీల జూనియర్ విభాగంలో పాల్గొని, స్నాచ్ 86 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్ 107 కేజీలు మొత్తంగా 107 కేజీల బరువును ఎత్తి, బంగారు పతకం, 64 కేజీల సీనియర్ విభాగంలో పాల్గొని, స్నాచ్‌లో 86 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 107 కేజీలు మొత్తంగా 193 కేజీల బరువును ఎత్తి, వెండి పతకం సాధించింది. చుక్క శ్రీలక్ష్మి 81 కేజీల విభాగంలో పాల్గొని, స్నాచ్ 83 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 106 కేజీలు మొత్తంగా 189 కేజీల బరువు ఎత్తి, కాంస్య పతకం దక్కించుకుంది.

బొలెరోతో ఢీకొట్టి, ఈడ్చుకుంటూ వెళ్లి..



మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కృష్ణ ముఖంపై బలమైన గాయాలు ఉండడంతో బంధువులతో పాటు పోలీసులు కూడా హత్యగా అనుమానించి, ప్రమాద స్థలం వద్ద ఉన్న ఇరుగు పొరుగు షాపుల వారిని, దర్యాప్తు చేశారు. ఓ షాపు యజమానితో పాటు హత్యను కళ్లారా చూసిన ఓ ఆటోడ్రైవర్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. బొలెరో వాహనంతో ఢీకొట్టి, ఈడ్చుకుంటూ కొంత దూరం తీసుకువెళ్లారని, వాహనంలో నుంచి డ్రైవర్ దిగి, కృష్ణ మృతి చెందాడో లేదో తెలుసుకుని చెప్పులు, రాడ్డుతో దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు వివరించారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేయగా, కృష్ణకు తన స్వగ్రామం ఉద్దవోలులో రాజకీయ విబేధాలు ఉన్నాయని, దాని కారణంగానే హత్య జరిగినట్లు పోలీసులు వివరించారు. కృష్ణ కుటుంబీకులు కూడా ఉద్దవోలు గ్రామానికి చెందిన వారే(రెండో వర్గీయులు) పాతకక్షలు మనసులో పెట్టుకుని, ఈ హత్య చేశారన్నారు. కృష్ణ కుమారుడు శ్రావణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.రవికుమార్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, మృతుని కుటుంబీకులు, బంధువులు పెద్దఎత్తున ఘటనాస్థలికి చేరుకుని, రోడ్డుపై బైఠాయించి, ఆందోళన చేశారు. హంతకులను త్వరగా పట్టుకుని, శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ..



సంఘటనపై ఆరాతీస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే వెంకట చినఅప్పలనాయుడు, చీపురుపల్లి డీఎస్పీ చక్రవర్తి

హత్య విషయం తెలుసుకున్న చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి ఘటన స్థలానికి చేరుకుని, హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి కక్ష పూరితమైన హత్య ఇదే మొదటిసారి చూడడమని, హంతకుల గురించి కచ్చితమైన సమాచారం ఉందని, త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సైతం ఘటన స్థలానికి చేరుకుని, హత్యకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధ్యాయుడు.. దారుణ హత్య



కృష్ణ(ఫైల్)



రోడ్డుపై బైఠాయించి, ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

- పాతకక్షలే కారణం
- పథకం ప్రకారమే దారుణానికి ఒడిగట్టిన దుండగులు
- మీడియా సమావేశంలో డీఎస్పీ వెల్లడి
- రోడ్డుపై బైఠాయించి, బంధువుల ఆందోళన

రాజాం సిటీ: మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ(58) దారుణ హత్యకు గురయ్యాడు. తొలుత ఉపాధ్యాయుడి మృతిని అంతా ప్రమాదంగా భావించి, బంధువులకు సమాచారమిచ్చారు. మరోవైపు విషయం తెలుసుకున్న రాజాం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, మృతిపై ఆరాతీశారు. రక్తపు మడుగులో ఉపాధ్యాయుడి మృతదేహం, అతడి ముఖంపై గాయాలు ఉండడంతో దానిని హత్యగా గుర్తించారు. స్థానికులతో పాటు ఉపాధ్యాయుడి స్వగ్రామంలో కూడా దర్యాప్తు చేయగా ఉపాధ్యాయుడు హత్యకు గురైనట్లు తెలిసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రాజాం పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్న ఏగిరెడ్డి కృష్ణ తెర్లాం మండలంలోని కాలంరాజుపేటలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఎప్పటిలాగే పాఠశాలకు బయలుదేరిన ఆయన కొత్తపేటకు దగ్గరలో హత్యకు గురయ్యాడు. మృతదేహం రోడ్డు పక్కనే బొలెరో వాహనం వద్ద పడి ఉంది. స్థానికులు ఈ విషయాన్ని రాజాం పోలీసులకు తెలియజేయగా, అక్కడికి చేరుకున్న పోలీసులు కృష్ణ మృతదేహాన్ని గుర్తించి, బంధువులకు విషయం తెలియజేశారు. అక్కడికి చేరుకున్న బంధువులు మృతదేహంపై పడి బోరున విలపించారు.

ఫిర్యాదులో ఏముంది..

తాము కొంతకాలంగా రాజాంలోని గాంధీనగర్‌లో ఉంటున్నామని, తన తండ్రి కృష్ణ 1998లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందారని కృష్ణ కుమారుడు శ్రావణ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. అంతకు ముందు తమ స్వగ్రామం తెర్లాం మండలం, ఉద్దవోలులో రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గెలుపొంది, సేవలందించారన్నారు. ఉద్యోగం రావడంతో రాజాంలో ఉండి, ప్రశాంత జీవనం గడుపుతున్నామని, పరోక్షంగా గ్రామంలో రాజకీయాలకు మద్దతుగా నిలుస్తుండేవాడన్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందిన వ్యక్తికి తన తండ్రి మద్దతు ఇచ్చాడని, దీనిని ఓర్వలేక ప్రత్యర్థివర్గమైన మరడాన వెంకటనాయుడు, మరడాన మోహనరావు, మరడాన గణపతి, మరడాన రామస్వామిలు మా నాన్నపై కక్ష పెంచుకున్నారని పేర్కొన్నారు. ఎప్పటిలాగే మా నాన్న శనివారం స్కూల్‌కు వెళ్తుండగా, ఇదే అదునుగా భావించిన దుండగులు హత్యకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బైక్ ఢీకొని..



మృతుడు సూరిబాబు

విజయనగరం క్రైమ్: బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన దుర్ఘటన స్థానిక ఇందిరానగర్ సమీపంలో జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇందిరానగర్ గోకపేట చెరువు సమీపంలో శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో బైక్‌పై విజయనగరం ఎత్తుబ్రిడ్జి నుంచి వీటీ అగ్రహారం వెళ్తున్న గోవింద అనే వ్యక్తి రోడ్డు పక్క నుంచి నడుచుకుని వెళ్తున్న దాసన్నపేటకు చెందిన దుక్క సూరిబాబు(54)ను బలంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలపాలైన సూరిబాబును వైద్యసేవల కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ రామగణేష్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య..

విజయనగరం క్రైమ్: భార్య మందలించిందన్న మనస్తాపంతో కర్ని శివకుమార్(34) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడి, మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను టూటౌన్ పోలీసులు శనివారం వెల్లడించారు. స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న శివకుమార్ విశాఖలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసగా మారిన అతడిని భార్య ఎప్పటిలాగే మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు బాత్రూమ్ క్లీనర్‌ను తాగేశాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఏఎస్‌ఐ రామారావు తెలిపారు.

జెడ్పీ చైర్మన్‌ను పరామర్శించిన టీటీడీ చైర్మన్, మంత్రులు





జెడ్పీ చైర్మన్ తండ్రి నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమరనాథ్‌లు శనివారం కలిసి పరామర్శించారు. ఈ నెల 13న శ్రీనివాసరావు తండ్రి మజ్జి నర్సింగరావు స్వర్గస్తులైన విషయం విదితమే. ఈ మేరకు టీటీడీ చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు విజయనగరంలోని ఆయన స్వగృహానికి చేరుకుని, నర్సింగరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. నర్సింగరావు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. పరామర్శించిన వారిలో జెడ్పీ చైర్మన్, మంత్రులతో పాటు మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, శంబంగి వెంకటచిన అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు, కంబాల జోగులు, గొర్లె కిరణ్‌కుమార్, విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేట ప్రసాద్, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నక్కల నాయుడుబాబు, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, డీసీసీబీ చైర్మన్ వేచలాపు చినరామనాయుడు, డీఆర్‌ఓ గణపతి రావు, మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమావతి, మీసాల నీలకంఠం, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తదితరులు ఉన్నారు.

డెంగీ లక్షణాలతో మహిళ మృతి!

విజయనగరం ఫోర్ట్: పట్టణానికి చెందిన ఓ మహిళ డెంగీ లక్షణాలతో శనివారం మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న వసంత విహార్‌లో నివాసం ఉంటున్న కాజల్ సింగ్(34) అనే మహిళకు ఈ నెల 8వ తేదీన జ్వరం వచ్చింది. 13వ తేదీ వరకు జ్వరం తగ్గకపోవడంతో పరిస్థితి విషమమైంది. దీంతో దగ్గరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు ఆమెను తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. మహిళ మృతి చెందిన విషయం డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు దృష్టికి వెళ్లడంతో ఆయన విచారణ చేపట్టగా, సదరు మహిళ డెంగీ లక్షణాలతో పాటు మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్ వల్ల మృతి చెందినట్లు తెలిసింది. డెంగీ పరీక్షకు శాంపిల్స్‌ను ప్రభుత్వాస్పత్రికి పంపించామన్నారు.

తక్కువ ధరకే నిత్యావసరాలు

- ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుబజార్లలో విక్రయాలు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరకే అందిస్తున్న నిత్యవసరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మధుసూదనరావు కోరారు. పెరిగిన నిత్యవసరాల ధరలను మధ్యతరగతి ప్రజలు భరించలేని పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వమే బియ్యం, కందిపప్పు, శనగపప్పు, మినపపప్పు, పెసరపప్పులను అందుబాటు ధరలో ఉంచి, విక్రయాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ దగ్గరున్న రైతు బజారు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిత్యవసర సరుకుల అమ్మకాల కౌంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జేసీ కె.మయూర్ అశోక్ సూచనలతో జిల్లాలోని అన్ని రైతుబజార్లలోనూ ఈ అమ్మకాల కౌంటర్‌ను ప్రారంభించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పౌరసరఫరాల పంపిణీ సంస్థ డీఎం మీనాకుమారి, మార్కెటింగ్ శాఖ ఏడీ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.




నిత్యవసర సరుకుల అమ్మకాలను ప్రారంభిస్తున్న డీఎస్‌ఓ మదుసూధనరావు, డీఎం మీనాకుమారి, ఏడీ యుగంధర్

నిత్యవసర సరుకులు	ప్రస్తుత ధర	రైతుబజార్ ధర
బియ్యం(బీపీటీ)	58	48
బియ్యం(సాంబమసూరి)	52	46
కందిపప్పు(మాచెర్ల)	148	138
కందిపప్పు(దిగుమతి)	130	118
శనగపప్పు	70	64
పెసరపప్పు (ఖమ్మం/విజయవాడ)	105	96
మినపపప్పు(గుండు)	128	110

ప్రజలపై ధరల భారం పడకుండా..

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ఓ ప్రత్యేక దుకాణంలో తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయాలను ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలపై నిత్యావసరాల ధరల భారం పడకుండా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందని, సరుకులు కావాల్సిన వారు ఆధార్‌కార్డు తీసుకుని వెళ్లాలని, బీపీటీ గ్రేడ్–1 రకం బియ్యం కిలో రూ.48 చొప్పున 10 కిలోలు, రూ.137కు కిలో కందిపప్పు అందివ్వడం జరుగుతుందన్నారు. జేసీ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలోని పార్వతీపురం పట్టణంలో రెండు ప్రత్యేక కౌంటర్లు, సాలూరులో మరో రెండు, పాలకొండలో మూడు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం, జిల్లా వర్తక సంఘం ఆధ్వర్యంలో నగరంలోని రెండు కౌంటర్లలో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు సరుకుల అమ్మకాలు జరుగుతాయన్నారు. నెల రోజుల పాటు ఈ విక్రయాలు ఉంటాయన్నారు. తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్.శివప్రసాద్, డీటీ రామారావు, వర్తక సంఘం ప్రెసిడెంట్ జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: నిత్యవసర సరుకుల విక్రయ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, జేసీ గోవిందరావు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని.. విద్య, ఉపాధి రంగాల్లో ప్రాధాన్యం దక్కుతుందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల(ఏపీ ఆరో ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యాడెట్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు)ను ఆయన శనివారం ప్రారంభించారు. శని, ఆదివారాల్లో జరిగే జరిగే ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులను ఉద్దేశించి, ఆయన మాట్లాడారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తుండడం శుభపరిణామమన్నారు. బాల్య దశ నుంచే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరర ఆరోగ్యం కలగడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. జిల్లా నుంచి క్రీడల్లో రాణించిన ఎంతోమంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, పేరు ప్రఖ్యాతలు సాధించారని వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కోరారు. జిల్లాలో క్రీడారంగం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ పోటీలకు మొత్తం 300 మంది క్రీడాకారులు హాజరయ్యారని, ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నామన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా ఏసీఏ వ్యవస్థాపక దినోత్సవం

విజయనగరం: జిల్లాలోని డెంకాడ మండలం, చింతలవలస గ్రామంలో ఉన్న డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఏసీఏ(ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్) వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ స్థాపించి, 70 ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ జీవీఎస్ఎన్ రాజు, అకాడమీ కన్వీనర్ పీవీ దేవవర్మ కలిసి ఏసీఏ పతకాన్ని ఆవిష్కరించి, మొక్కలు నాటారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కోశాధికారి పి.సీతారామరాజు, అకాడమీ చీఫ్ కోచ్ కిశోర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,000–00
బంగారం(22సి. 10గ్రా.)	55,000–00
వెండి (కిలో)	81,800–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210